క్లుప్తంగా

నేడు చాటపర్రులో 'ఆడుదాం ఆంధ్ర' ప్రారంభం

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం చాటపర్రు జెడ్పీ పాఠశాల ఆవరణలో మంగళవారం 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీలు ప్రారంభంకానున్నట్లు ఎంపీడీఓ బి.ప్రణవి తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షుడు పెన్మెత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో స్థానిక సచివాలయ జట్లు పెద్ద సంఖ్యలో పాల్గొంటాయని పేర్కొన్నారు. మండలంలో 14 సచివాలయాలకు చెందిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బాడ్మింటన్ జట్లకు ఆయా ప్రాంతాల్లోనే ఆట స్థలాల వద్ద పోటీలు చేపడతామన్నారు. ఇప్పటికే ఆట స్థలాలు సిద్ధం చేసి, స్థానిక సచివాలయాలకు క్రీడా పరికరాలు అందజేశామన్నారు. సచివాలయం, వలంటీర్ల యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న జట్లు, క్రీడాకారులు హాజరు కావాలని సూచించారు.

వరాహావతారంలో జనార్దన స్వామి



వరాహావతారంలో స్వామివారు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ భూ, నీళా సమేత శ్రీ జనార్దన స్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి విశేష పూజలు చేశారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, తిరుప్పావై సేవా కాలం నిర్వహించారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు జరిగాయి. స్వామివారు వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు వంగల పవన్ కుమార్ విశేష పూజలు నిర్వహించగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీల్లో సుమాంజలి ప్రతిభ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో నగరంలోని శ్రీ శర్వాణి పాఠశాల విద్యార్థిని బి.సుమాంజలి ప్రథమ స్థానం సాధించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 24న ×ఈ – కామర్స్, డిజిటల్ వర్తకం, వినియోగదారుల రక్షణ× అనే అంశంపై ఇంగ్లీష్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థిని పాల్గొంది.

లోక రక్షణకు క్రీస్తు జననం



బిషప్ జయరావుకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఫాదర్లు



మన్నా చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న మేయర్ దంపతులు



ఐసీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న బిషప్ జాన్ఎస్‌డీ రాజు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు



సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న రెవ. రంజిత్



సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

- బిషప్ జయరావు పొలిమేర
- నగరంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- శాంతి సందేశాలు ఇచ్చిన బిషప్‌లు, ఫాదర్లు, పాస్టర్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): లోక రక్షణ కోసమే ఏసు క్రీస్తు జననం సంభవించిందని ఏలూరు కథోలిక పీఠం బిషప్ జయరావు పొలిమేర అన్నారు. స్థానిక గ్జేవియర్ నగర్‌లోని అమలోద్భవి కథిడ్రల్ చర్చిలో ఆదివారం అర్ధరాత్రి నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో బిషప్ క్రీస్తు సందేశాన్నిచ్చారు. ఈ క్రిస్మస్ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. దేవుని బిడ్డగా ఏసు ప్రభువు జన్మించి తన రక్తంతో పాప పరిహారం చేసిన గొప్ప శాంతి దూత అన్నారు. క్రీస్తు బోధించిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని, పొరుగువారిని ప్రేమించడం ద్వారా క్రీస్తును చేరుకోవాని సూచించారు. ఫాదర్ మైఖేల్ ఇంజమాల, ఫాదర్ జి.మోజెస్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఐసీఎం సంఘాల కథడ్రల్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో బిషప్ జాన్ ఎస్‌డీ రాజు క్రీస్తు సందేశమిస్తూ యూఖరిస్తు ఆరాధనలో ప్రపంచ ప్రజలు శాంతితో, సమాధానంతో జీవించాలని కోరారు. కథడ్రల్ సంఘస్తులతో పాటు ఆయా ప్రాంతాల నుంచి విశ్వాసులు ఆరాధనలో పాల్గొన్నారు. కడప జిల్లా రిటైర్డ్ ప్రిన్సిపల్ జడ్జి ఎస్.సాల్మన్ రాజు, సీఆర్ఆర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎస్.చర్చిల్ దానియల్, ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎస్‌జే విక్టర్ మోసెస్, గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నతానియేలు, ఐసీఎం సంఘాల సీనియర్ ట్రస్టీ ఆర్.రవికుమార్, వైవీ ప్రసాద్, జాన్ లియో, పి.ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వమానవాళికి శాంతి సౌభాగ్యాలు కలగాలి

క్రీస్తు జన్మించిన శుభదినాన సర్వమానవాళికి శాంతి, సౌభాగ్యాలు కలగాలని ప్రార్థిస్తున్నామని నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు తెలిపారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మేయర్ దంపతులు తొలుత స్థానిక శాంతి నగర్‌లోని మన్నా చర్చిలో, అనంతరం కర్మేల్ ప్రేయర్ హౌస్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి పేద వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుత సమాజ స్థాపన కోసం రక్తాన్ని చిందించిన ప్రభువు జన్మదినం సందర్భంగా క్రైస్తవులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, కరుణ, దయ, జాలి, నీతితో ప్రభువు ప్రపంచానికి కొత్త మార్గాన్ని చూపించారన్నారు. ఏసు చూపిన మార్గాన్ని ప్రజలంతా ఆచరించి ప్రభువు ఆశీస్సులు, దీవెనలు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ పరిపాలనలో నగరం శాంతి సౌఖ్యాలతో విలసిల్లేలా చేయాలని ఎలీషా రాజు, జ్యోతిరాజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాతబస్టాండ్ సమీపంలోని సీఎస్ఐ చర్చ్, అమీనాపేట రిజర్వ్ పోలీస్ లైన్ సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలతో పాటు నగరంలోని అన్ని చర్చిల్లో, క్రైస్తవ సంఘాల్లో సోమవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బిషప్‌లు, ఫాదర్‌లు, బ్రదర్లు, పాస్టర్లు క్రైస్తవులకు క్రిస్మస్ సందేశమిచ్చారు. అనంతరం క్రైస్తవులు తమ నివాసాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, క్రిస్మస్ కేక్ కట్ చేసి, కొత్త దుస్తులు ధరించి పండుగను వేడుకగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తమ బంధువులతో పాటు హిందూ, ముస్లిం స్నేహితులకు తమ గృహాల్లో ప్రత్యేక ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం



దాత శివన్నారాయణకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఇద్దరు భక్తులు వేరువేరుగా సోమవారం రూ. 2,01,116 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా ఏలూరుకు చెందిన పి.రామ శ్యామల వెంకట శివన్నారాయణ రూ.1,01,116 ఆలయ కార్యాలయంలో జమచేయగా, దాతకు దేవస్థానం సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. అలాగే విజయవాడకు చెందిన మరో భక్తుడు అప్పరాజు వేంకట శేషు కామేష్ రూ.లక్ష ఆలయ కార్యాలయంలో జమచేయగా, ఆయనకు దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు.

నిరుపేద పిల్లలకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందించిన ట్రస్ట్ సభ్యులు

ఏలూరు రూరల్: క్రిస్మస్ పర్వదినాన్ని నిరుపేదలు సైతం సంతోషంగా జరుపుకోవాలని రివల్ చారిటబుల్ ట్రస్ట్ కాటూరి సుధాకర్ ఆకాంక్షించారు. మంగళవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ట్రస్ట్ ఆధ్వర్యాన స్థానిక యానాదుల కాలనీలో నిరుపేద పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యాన కొంతకాలంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దానిలో భాగంగా నిరుపేద పిల్లలు విద్యావంతులు కావాలని పుస్తకాలు, బ్యాగ్‌లు అందిస్తున్నామన్నారు. పండుగ వేళల్లో పౌష్టికాహారం, దుస్తులు ఇస్తున్నామన్నారు.

వైభవంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ



గంగన్నగూడెంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: గంగన్నగూడెంలో సోమవారం అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి నవగ్రహ సతీసమేత విగ్రహ ప్రతిష్ఠ పూజలు వైభవంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున నుంచి కాశీవిశ్వేశ్వర ఆలయంలో నవగ్రహ సతీమేత నాగమానసా దేవి, నాగబంధం, కాలభైరవ విగ్రహాలను వేదపండితు మంత్రోచ్ఛరణ మధ్య సంప్రదాయబద్ధంగా ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పలపాటి మాణిక్యాలరావు, వైస్ చైర్మన్ మొటపర్తి గాంధీ, సెక్రటరీ శాఖమూడి సీతారామాంజనేయులు, సర్పంచ్ ఉప్పలపాటి లక్ష్మణరావు, కోశాధికారి కూచిపూడి వెంకట కిషోర్ ఆధ్వర్యంలో వైభవంగా పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీ మాగంటి బాబు, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వేర్వేరుగా పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ ఉప్పలపాటి మాణిక్యాలరావు పూర్ణకుంభంతో, ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని స్వాగతం పలికారు. గంగన్నగూడెం సొసైటీ చైర్మన్ బోయపాటి గాంధీ, బోయపాటి గణేష్, నాదెండ్ల నారాయణ ప్రసాద్, గన్నమనేని రాజా, భక్తులు పాల్గొన్నారు.

బిషప్ జయరావును కలిసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావును కలిసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావును సోమవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆయన కార్యాలయంలో కలిశారు. పుష్పగుచ్ఛం, కేక్ అందించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పీఠాధిపతి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బిషప్ సెక్రటరీ ఫాదర్ స్టీవెన్, ఏలూరు పీఠం ప్రొక్యూరేటర్ ఫాదర్‌రాజు, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానియేలు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి



పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): మాజీ ప్రధాని ఏబీ వాజ్‌పేయి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అశోక్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్నేని కృష్ణప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ విక్రమ్ కిషోర్, నడపన దాన భాస్కరరావు, కన్వీనర్ గాది రాంబాబు, నాయకులు పాల్గొన్నారు. స్థానిక ఒకటో డివిజన్ బావిశెట్టివారి పేటలో మండల ప్రధాన కార్యదర్శి పల్లంట్ల జ్యోతి కుమార్ ఆధ్వర్యాన నూతనంగా నిర్మించిన బీజేపీ జెండా స్థూపాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి చౌదరి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రక్కి మహి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ కోశాధికారిగా అక్బర్



వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ పాలకవర్గంలో చోటు సాధించిన సభ్యులు

ఏలూరు రూరల్: వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ కోశాధికారిగా ఎస్ఎం అక్బర్ ఎన్నికయ్యారు. శనివారం విశాఖపట్టణంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న సభ్యులు అక్బర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 1,500 క్లబ్‌లు, 2 లక్షల మంది సభ్యులు గల వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ కార్యక్రమాల్లో అక్బర్ కొంతకాలంగా చురుగ్గా పాల్గొంటున్నారు. ఇదే క్రమంలో ఏలూరుకు చెందిన వి.మురళీమోహన్ అధ్యక్షునిగా, ఎం.ప్రదీప్ కార్యదర్శిగా ఎన్నికై సభ్యుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులైన వీరు ముగ్గురు వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ పాలకవర్గంలో చోటు సాధించడంపై పలు సంఘాల సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	52	చిక్కుడు కాయలు	88
వంకాయలు (కాంతులు)	56	చామదుంపలు	120
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	10–15
బెండకాయలు	50	కంద	56
పచ్చిమిర్చి	46	బీట్‌రూట్	36
కాకర కాయలు	40–50	కీర దోస	36
బీరకాయలు	50	ఫ్రెంచ్‌బీన్స్	72
బీరకాయలు (పందిరి)	68	అల్లం	128
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	44–54	పాలకూర	12
దొండకాయలు	70	చుక్కకూర	12
బంగాళదుంపలు	28	తోటకూర	12
ఉల్లిపాయలు	33	గోంగూర	08
గోరుచిక్కుడు	64	పుదీనా	05
దోసకాయలు	40–50	బఠాణీ	--
ఆనబకాయ (1)	30–40	క్యాప్సికమ్	74
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	11
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	19
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	24
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	05
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	08
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	01
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	04
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	04
ద్వారకాతిరుమల –ఏలూరు– బీహెచ్ఈఎల్	22.15	4822	05
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	37
ఏలూరు –తిరుపతి	16.00	4830	28

అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యంగా కృషి



జగన్నాథపురంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ, సర్పంచ్, ఎంపీటీసీలు

పెదవేగి : గ్రామాల్లో పర్యటించి ప్రజల అవసరాలు తెలుసుకుని వాటిని పరిష్కరించి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడం తనకెంతో ఆనందాన్ని కలుగజేస్తోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం పెదవేగి మండలం జగన్నాథపురంలో రూ.43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కల్లెపల్లివారిగూడెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన, జగన్నాథపురం సచివాలయ పరిధిలో రూ.5 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్య, పెదవేగి సొసైటీ చైర్‌పర్సన్ పెనుమాక వెంకట సుబ్బారావు, విజయరాయి సొసైటీ చైర్మన్ పాలడుగు పెదబాబు, సర్పంచ్ మాత్రపు కోటేశ్వరరావు, ఎంపీటీసీ రాచప్రోలు చంద్రరావు, స్థానిక నాయకులు మానుకొండ చంద్రరావు, కొలికిపాముల రాంబాబు, ఆడమిల్లి ఏసుపాదం, సొంగ సత్యం పాల్గొన్నారు.

శక్తీశ్వరాలయానికి రూ.2.50 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: దక్షిణ కాశీగా విరాజిల్లుతోన్న భీమవరం మండలం యనమదుర్రులోని శ్రీ పార్వతీ సమేత శ్రీ శక్తీశ్వర స్వామివారి ఆలయానికి, మండలంలోని రామసింగవరం పంచాయతీ, కొత్తగూడెంకు చెందిన పెన్మెత్స నరసింహరాజు, రాజరాజేశ్వరి దంపతులు రూ.2.50 లక్షలను విరాళంగా సోమవారం అందజేశారు. ఈ విరాళాన్ని నరసింహరాజు తన తల్లిదండ్రులు శక్తీశ్వరరాజు, వరలక్ష్మి పేరున ఆలయ అభివృద్ధి నిమిత్తం దేవస్థానం కమిటీకి అందించినట్టు చెప్పారు. అనంతరం నరసింహరాజు కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొయ్యలగూడెం వాకర్స్ క్లబ్‌కు అవార్డు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం వాకర్స్ క్లబ్‌కు అవార్డు లభించినట్లు జోనల్ చైర్మన్ ఎస్‌బీజీ శేఖర్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఈనెల 24వ తేదీ విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ కన్వెన్షన్ హాల్లో 32వ ఇంటర్నేషనల్ వాకర్స్ సమావేశం నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం వాకర్స్ క్లబ్ మహాత్మా గాంధీ ఫెలోషిప్ సభ్యత్వాలను రాష్ట్రంలోనే అత్యధికంగా నిర్వహించిందని, దీనిని గుర్తించి ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ చైర్మన్ డాక్టర్ రవీంద్ర అవార్డును ప్రదానం చేశారన్నారన్నారు. ఘంటసాల గణపతి, గెడ్డం రాంబాబు, ఎల్.మోహన్, మాదేటి సత్యనారాయణ, చల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజమే మానవత లక్ష్యం

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపనే మానవత లక్ష్యమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలులో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన భవన గృహ ప్రవేశం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు పంచకర్ల సత్యనారాయణ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నూతన భవనంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు.దాతలు గుల్ల అప్పల స్వామి, అచ్చాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమార్తె ఆదిలక్ష్మి, మనవడు కృష్ణ చైతన్యల ఆర్థిక సాయంతో బహూకరించిన ఫ్రీజర్ బాక్స్‌ను జిల్లా శాంతి రథాల కమిటీ చైర్మన్ అప్పక రాంబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి దాతలు అందించిన దాతృత్వం మరవలేనిదన్నారు. భీమడోలులో తీవ్రంగా గాయపడి ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న భవన కార్మికుడు యాదగిరి శ్రీనివాస్‌కు మానవత సంస్థ రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ రామిశెట్టి గంగాధరరావు, మండల చైర్మన్ గుల్ల నూకరాజు, కోశాధికారి గుల్ల అప్పారావు, పెద్దలు తుమ్మల ఉమామహేశ్వరరావు, పి.సత్యనారాయణ, మాజీ మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం

దెందులూరు: చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా మసీదుపాడులో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మోత్రపు జేమ్స్ రాజుకు సోమవారం రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధితుడికి చికిత్స నిమిత్తం తమ వంతుసాయం అందించామని చేయూత సంస్థ సభ్యులు తెలిపారు.

పాదయాత్రగా ఇరుముడి స్వాములు

టి.నరసాపురం: ఆంజనేయ మలాధారణ స్వాములు మద్ది క్షేత్రానికి కాలినడకన వెళ్లారు. ఆంజనేయ మాల ధరించి 41 రోజుల పాటు దీక్ష చేసిన స్వాములు సోమవారం దీక్ష విరమణ నిమిత్తం హనుమాన్ నామస్మరణతో పాదయాత్రగా గుర్వాయిగూడెం మద్ది క్షేత్రానికి వెళ్లారు. దీక్షాధారణ స్వాములు మాట్లాడుతూ సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని స్వామి వారి క్షేత్రానికి వెళ్లి ఇరుముడులు సమర్పించి దీక్ష విరమించనున్నట్లు చెప్పారు. మొత్తం 50 మంది స్వాములు పాదయాత్రగా వెళుతున్నట్లు తెలిపారు. తొలుత ఆంజనేయస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, ఇరుముడులు శిరస్సున ధరించి బయలుదేరి వెళ్లారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

కొయ్యలగూడెం: నిరుపేద విద్యార్థికి పొంగుటూరు పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన కొత్తపల్లి దుర్గ ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసిస్తుండగా తండ్రి కోల్పోవడంతో తల్లితో సహా దుర్గ పలు ఇళ్లలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ పసుపులేటి రాంబాబు, ఆర్ఎంపీ సతీష్‌ని సంప్రదించడంతో ఆయన నేతృత్వంలో దుర్గ తల్లి పోచమ్మకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దుర్గ చదువుకు తామంతా సహకరిస్తామని వారు పేర్కొన్నారు. పి.అరవింద్, గేలం శ్రీను, కె.సత్తిబాబు, ఎంపీటీసీ నేలపోలు దుర్గారావు, డి.మధు, కె.గోపి, టి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.